


# నేను - నా జ్ఞాపకాలు

## - జీడిగుంట రామచంద్రమూర్తి



*రచనా కాలం: 2019*

*(గత సంచిక తరువాయి)*

### నాకు జ్ఞాపకం లేని "ఆ అరవై రోజులు"

2012 ఆగస్టు 31 వ తేదీ రాత్రి ఏడు గంటలవుతూండగా నేను ఒక సమావేశంలో పాల్గొనటానికి ప్రెస్ క్లబ్బుకి వెళ్ళాను. ఇంకా సమావేశం ప్రారంభం కాలేదు హఠాత్తుగా నా మెడ రెండు వైపులా నొప్పి ప్రారంభమైంది. కొద్ది నిమిషాలకే ఆ నొప్పి రెండు కణతలకు ప్రాకింది. నాకు'స్పాండిలైటిస్'వున్న కారణంగా ఆ నొప్పి వచ్చివుంటుదనుకున్నాను. క్షణాల్లో నొప్పి విపరీతమై కళ్లు తిరిగాయి. సమావేశం నించి ఇంటికి వెళ్లిపోతే మంచిదనుకున్నాను. కుర్చీలోంచి లేవబోయాను.

నాకేమీ కనిపించలేదు. స్పృహ కోల్పోతున్నట్లు అనిపించింది. అంతే అలా కుర్చీలోనే కూలిపోయాను తర్వాత ఏం జరిగిందో నాకు తెలీదు. తిరిగి సెప్టెంబరు 20 వ తేదీన నా కుటుంబ సభ్యులతో కేర్ ఆస్పత్రినించి ఇంటికి చేరటం మాత్రమే జ్ఞాపకం వుంది. ఆ మధ్యలో ఇరవై రోజులూ ఏం జరిగిందో నాకు జ్ఞాపకంలేదు.

నా భార్యా, నా పిల్లలూ ఆ ఇరవై రోజులూ ఏం జరిగిందో రాస్తామంటే రాయమన్నాను. వాళ్లు రాసిన ఆ ఇరవై రోజుల వాళ్ల జ్ఞాపకాల్నీ యధాతధంగా మీకు తెలియపరుస్తున్నాను. చదవండి ...

" పేషంట్ స్పృహలోకి వస్తేనే మాక్కూడా ఆయన పరిస్థితి తెలుస్తుంది. ఇది 'నెర్వస్ కి సంబంధించిన ఆపరేషన్ కదా! బ్రెయిన్ సర్జరీ! అయినా హీ విల్ బి ఆల్ రైట్" అని బయటకు వెళ్లిపోయారు.

ఆపరేషన్ పూర్తయి ఐ.సి.యు. రూమ్ లోకి వచ్చిన రెండు గంటలకు అనుకుంటా సుమారు రాత్రి పదిగంటలకు బయటకు ఓ నర్సు వచ్చి- "పేషంట్ కి స్పృహ వచ్చింది,

డా ॥ సుబ్రహ్మణ్యంగారు పిలుస్తున్నారు" అని మాకు చెప్పింది. అయితే "ఎవరో ఒకరు మాత్రమే వచ్చి చూడండి" అని కూడా ఆమె చెప్పటంతో నేను హాస్పిటల్ గౌను వేసుకుని ఆతృతగా లోపలకు వెళ్లాను.

కళ్లు తెరిచాక నాన్న నన్నే చూస్తున్నారు. నాలో ఓ రకమైన ఉద్వేగం .. బాధ .. టెన్షన్ అన్నీ కలిసిన ఇమోషన్స్ .. అంతలో డా ॥ శివారెడ్డిగారి టీమ్ కి న్యూరో కన్సల్టెంట్ అడ్వైజర్ సుబ్రహ్మణ్యంగారు నాన్న దగ్గరకు చేరుకుని 'మూర్తిగారూ! మూర్తిగారూ!' అని గట్టిగా పిలిచారు.

నాన్న పూర్తిగా స్పృహలోకి వచ్చారు. డా ॥ శివారెడ్డిగారు ముందుగా మాతోచెప్పినట్టు నాన్నకి హార్ట్ స్ట్రోక్ రాలేదని మాకు అర్థమైంది. సుబ్రహ్మణ్యం గారు పిలిస్తే చూశారు కనుక నాన్నకి వినికిడి శక్తి పోలేదనీ, కళ్లు తెరిచి చూశారు కనుక చూపు కూడా పోలేదని తెలుసుకున్నాం. నన్ను చూపించి “ఈయన ఎవరు?” అని అడిగారు సుబ్రహ్మణ్యంగారు మా నాన్నని.

"శ్రీ ..... శ్రీధర్” అంటూ మత్తుగా పలికారు నాన్న.

శివారెడ్డిగారు జరుగవచ్చునని చెప్పిన ప్రమాదాలు ఏమీ జరగలేదు. ఇంతలో సుబ్రహ్మణ్యంగారు 'కాలు ఎత్తండి!', 'చెయ్యి ఎత్తండి' అని అడిగారు. నాన్న ప్రయత్నం చేశారు. పూర్తిగా ఎత్తలేకపోయినా– మొత్తానికి ప్రయత్నం చేశారు కనుక పక్షవాతం కూడా రాలేదని గ్రహించాం! డాక్టర్ గారు మళ్లీ ఆయన చేతివేళ్లు చూపిస్తూ 'ఇవి ఎన్ని వేళ్లు?” అని అడుగుతున్నారు. మూడు .. అయిదు .. అంటూ కరెక్టుగానే చెప్తున్నారు నాన్న.

అంతే! ..

నా ఆనందానికి అవధులు లేవు. 'యాహూ' అనే హాహాకారంలాంటి శబ్దంనానోట నుంచి వచ్చింది. అలాంటి అరుపు నా జీవితంలో ఇప్పటివరకూ మళ్ళీ ఎప్పుడూ రాలేదు. అప్పటి ఆనందమయమైన పరిస్థితి అది! చాలా ఉత్సాహంతో, పరుగులాంటి సడకతో బయటకు వచ్చాను. 'నాన్న సూపర్ గా వున్నారు' అంటూ చెప్తుంటే నాకు తెలియకుండానే నా కళ్ళు ఆనందబాష్పాలతో నిండిపోయాయి.

తర్వాత, అమ్మ, సారధి, తేజ, పూజ, అందరూ ఒక్కొక్కరే లోపలికి వెళ్ళి నాన్నని చూసొచ్చారు. రాత్రి పన్నెండపోయింది. అమెరికా నుంచి నా తమ్ముడు వేణు, ఆదేరోజు రాత్రి హైదరాబాద్ చేరుకుని ఎయిర్ పోర్ట్ నుంచి నేరుగా ఆస్పత్రికి వచ్చేశాడు. నాన్నని చూశాడు. అంతవరకూ జరిగిన సంగతులన్నీ వానికి చెప్పాను. వాడి కళ్లలో కూడా నీళ్లు తిరిగాయి.

ప్రయాణం చేసివచ్చిన వాణ్ణి ఇంటికి పంపించి, ఆ రాత్రి నేను ఆస్పత్రిలోనే వుండిపోయాను. నాలుగు రోజులు గడిచాయి. మా అందరికీ నాన్నని ఎప్పుడు డిశ్చార్జ్ చేస్తారో తెలుసుకోవాలన్న ఆతృత ఎక్కువైంది. శివారెడ్డిగారు, ఇతర డాక్టర్లూ ఓరోజు పొద్దున శాండ్స్ కి వచ్చారు. “మీ నాన్నగార్ని చూశారా? మాట్లాడారా?” అని అడిగారాయన. ఆ

తర్వాత "నాలుగు రోజులు ఐ.సి.యు.లోనే వుంచి తర్వాత రూమ్ కి షిఫ్ట్ చేస్తాం" అని చెప్పారు.

"ఎపుడు డిశ్చార్జ్ చేస్తారు సార్?" అని అడిగాను. డాక్టర్ గారు జవాబు చెప్పలేదు. కానీ "చూద్దాం! ముందు రూమ్ కి షిఫ్ట్ చేశాక చెప్తాం!" అని వెళ్లిపోయారు. రాత్రి రెస్టు తీసుకుని నా తమ్ముడు వేణు! ఉదయం ఆస్పత్రికి వచ్చాడు. అమెరికా నుంచి వాడు రావటంతో మేం కొంచెం రిలాక్స్ అయ్యాం!

వాడు నాన్నని వదిలి క్షణం కూడా వుండలేదు. చుట్టాలూ, మిత్రులు, శ్రేయోభిలాషులూ అందరూ వచ్చి నాన్నని చూసి వెడుతుండేవారు. నాన్నకి మూడుపూటలా ఏదో ఆహారం ఇవ్వమని చెప్పారు డాక్టర్లు. ఒకరోజు అమ్మ, ఒకరోజు మా పిల్లలు, ఒకరోజు నా భార్యా అలా మేమందరం వెళ్లి పెడుతుండేవాళ్లం. వేణు పక్కనే కనిపించేవాడు. అక్కడ నర్సులు కూడా నాన్నని బాగా చూసుకునేవాళ్లు.

మా అన్నయ్య గారి అబ్బాయి వరుణ్ సందేశ్ (సినిమా హీరో) షూటింగ్ లో అప్పట్లో బిజీగా వుంటున్నా రాత్రి సమయాల్లో నాలుగైదుసార్లు వచ్చి చూశాడు. 'తాతయ్య క్షేమంగా ఇంటికి రాగానే అయ్యప్పమాల వేసుకుంటానని అయ్యప్పస్వామికి మొక్కుకున్నాడు. నర్సులూ, ఇతర సిబ్బందీ మా సందేశ్ తో ఫోటోలు తీసుకున్నారు.

మెదడు ఆపరేషన్ మూలాన నాన్న 24 గంటలూ మత్తులోనే నిద్రపోతూ వుండేవారు. ఆహారం ఇవ్వటానికి, మందులు వేయటానికీ లేపేవాళ్లం. మళ్లీ నిద్రపోయేవారు. సెప్టెంబర్ 8 వ తేదీ శనివారం! నాన్నని రూమ్ కి షిఫ్ట్ చేశారు. ఈ వారం రోజుల్లోనూ బేగంపేటలో వున్న సెంట్రల్ గవర్నమెంట్ హెల్త్ కేర్ కేంద్రానికి వెళ్లి, అంతకుముందు మేం ఇచ్చిన అడ్వాన్స్ తిరిగి తీసుకునేందుకు ప్రయత్నాలు చేశాం.

ఈ లోగా డాక్టర్లు మాకు కొన్ని సూచనలు చేశారు. రోజూ పొద్దున్న సాయంత్రం వాకర్ సాయంతో నాన్నచేత పదడుగులు వేయించమన్నారు. కొంచెం సేపు' బెడ్ మీదనే కూర్చోపెట్టమని చెప్పారు.

నాన్న రూమ్ లోకి వచ్చాక 'వాసు' అనే అబ్బాయిని అటెండెంట్ గా నియమించారు. అతనొక్కడే కాకుండా మా కుటుంబ సభ్యుల్లో ఎవరో ఒకరం నాన్నకు తోడుగా రూమ్ లోనే వుండేవాళ్లం! సాయంత్రం సమయాల్లో నాన్నను చూసేందుకు విజిటర్స్ చాలామంది వచ్చేవారు. నాన్న సెలబ్రిటీ కావటంవల్ల నాకు కూడా ఆస్పత్రి సిబ్బంది తెలిసివుండటంవల్లా సెక్యూరిటీ వాళ్లు కూడా అంతగా పట్టించుకునే వారుకారు. హాస్పిటల్ వాతావరణంలా కాకుండా ఏదో టూరిస్ట్ హెూటల్లో వున్న భావన కలిగేది మాకు!

ఆయన్ని చూసేందుకు ఎవరు వచ్చినా అప్పుడు గుర్తుపట్టి పలకరించి మాట్లాడేవారు నాన్న కానీ! ఇప్పుడు అడిగితే సరిగా చెప్పలేరు. గుర్తు లేదంటారు.

సెప్టెంబర్ 12 వ తేదీ బుధవారం! సాయంత్రం డా ॥ శివారెడ్డి గారు, డా ॥ సుబ్రహ్మణ్యంగారు వచ్చి "రేపు మీ నాన్నగార్ని డిశ్చార్జి చేసేస్తాం! రేపట్నుంచీ పేషెంట్ బాధ్యత అంతా మీ ఫ్యామిలీ సభ్యులమీదే వుండాలి!' పోస్ట్ ఆపరేటివ్ కేర్ 'చాలా ఇంపార్టెంట్.

మీరు ఎంత బాగా చూసుకుంటే ఆయన అంత త్వరగా మామూలు మనిషవుతారు!" అని చెప్పి వెళ్లిపోయారు.

నాన్న హాస్పిటల్ నుంచి ఇంటికి వచ్చాక ఆయనకు ఎలాంటి సౌకర్యాలు అవసరమవుతాయో, వాటిని ముందుగానే సమకూర్చుకున్నాం. నాన్నకి నడిచేశక్తి, కూర్చునే ఓపిక లేకపోవటంతో ఓ మనిషిని ఏర్పాటు చేసుకుంటే మంచిదని నిర్ణయించుకున్నాం.

ఇంతలోనే మరో అవాంతరం ఏర్పడింది. ఆరోజు సెప్టెంబర్ 13. ఉదయం 11 గంటల సమయం. నాన్నని డిశ్చార్జి చేస్తారని ఎదురుచూస్తున్నాం. నాన్న పడుకునే ఒణికిపోతూ కనిపించారు. మాకు అర్థంకాక నర్స్ ని పిలిచాం! ఆమె వచ్చి నాన్నని చూసి డాక్టర్ గార్ని పిలిచింది. ఆయన వచ్చి చూశారు. లేపి కూర్చోపెడదామనుకున్నా లేవలేకపోతున్నారు నాన్న. బలవంతంగా కూర్చోపెట్టినా కుప్పకూలిపోతున్నారు.

మా అందరిలో మళ్లీ టెన్షన్ ప్రారంభమైంది. వేణు హడావుడిగా వెళ్లి డా ॥ శివారెడ్డిగార్నీ, సుబ్రహ్మణ్యం గార్నీ తీసుకొచ్చాడు. డాక్టరుగారు నర్సులను పిలిచి ఏదో చెప్పారు. వెంటనే వాళ్లు స్ట్రెచర్ తీసుకొచ్చి నాన్నని దానిమీద పడుకోబెట్టి తీసుకెళ్లారు!

మేము వాళ్లవెంట వెళ్లటం తప్ప, ఏం చేయాలో, అసలేం జరిగిందో తెలియలేదు. డాక్టర్లు కూడా మాకేం చెప్పలేదు. శివారెడ్డిగారి ఆధ్వర్యంలో బ్రెయిన్ కి స్కానింగ్, ఎం.ఆర్.ఐ. వగైరా టెస్టులు ఏవో చేశారు.

రాత్రి ఎనిమిదైపోయింది. అప్పటికి టెస్టులన్నీ అయ్యాక శివారెడ్డిగార్ని కలిశాం.

"బ్రెయిన్ లో ఫ్లూయిడ్స్ వుండిపోతున్నాయి ఏ.పి.షంట్ వెయ్యాలి! అంటే మెడలో ఓ రంధ్రం, కడుపులో మరో రంధ్రం చేసి, బ్రెయిన్ లోంచి సన్నని ట్యూట్ నొకదాన్ని కడుపులోకి వెయ్యాలి. ఆ ట్యూబ్ ద్వారా ఫ్లూయిడ్స్ కడుపులోకి వెళ్లిపోతాయి. ఇదంతా ఓ గంట ప్రొసీజర్" అని మాకు చెప్పి నాన్నని మళ్లీ ఆపరేషన్ థియేటర్ కి తీసుకెళ్లారు.

మళ్లీ అనస్తీషియా .. మళ్లీ ఆపరేషన్ .. మూడోసారి! 72 ఏళ్ల వయసులో ఓ మనిషి. 15 రోజుల్లో .. మూడు ఆపరేషన్లు! తట్టుకోవటం చాలా కష్టమే! కానీ నాన్న తట్టుకున్నారు.

ఆపరేషన్ జరిగిన తర్వాత రాత్రి 10 గంటలకి మళ్లీ ఐ.సి.యు.లోకి తీసుకొచ్చారు.

మళ్లీ రెండు రోజులు అక్కడే గడిచిపోయాయి. అందరం మళ్లీ ఆందోళనలో పడ్డాం.

డా ॥ శివారెడ్డిగారు మాత్రం మాకు ధైర్యం చెప్పారు. కంగారు పడాల్సిన అవసరం లేదన్నారు. సెప్టెంబర్ 16 వ తేదీ నాడు ఐ.సి.యు. నుంచి రూమ్ కి షిఫ్ట్ చేశారు. మర్నాడే డిశ్చార్జ్ చేసేస్తాం అన్నారు. కానీ ఎందుకో మాకే భయం వేసింది.

"ఇంకో రెండు రోజుల తర్వాత డిశ్చార్జ్ చేయండి!" అని కోరాం. డాక్టర్లు సరే అన్నారు. అదీ మంచిదే అయిందనిపించింది. తర్వాత దాన్ని 'కాంప్లికేషన్స్' వచ్చాయి. కడుపు బాగా ఉబ్బటం, ఆయాసం వంటివి! అప్పుడు గ్యాస్ట్రో స్పెషలిస్ట్ డా ॥ అబ్దుల్ ఖలీల్, కార్డియాలజిస్ట్ డా ॥ శ్రీదేవి ఆ కాంప్లికేషన్స్ రాకుండా ట్రీట్మెంట్ ఇచ్చారు.

మొత్తానికి సెప్టెంబర్ 20 వ తేదీన డిశ్చార్జ్ చేస్తున్నట్టు డాక్టర్ గారు చెప్పారు. అంతకుముందే అమెరికా నుంచి వచ్చిన తమ్ముడు వేణు సెప్టెంబర్ 18 వ తేదీన అమెరికా వెళ్ళిపోయాడు. వానికి ఇంకా మాతో ఉండాల్సిందని అనిపించినా సెలవు అయిపోయిన కారణాన, ఇంక రెండు రోజుల్లో నాన్న 'డిశ్చార్జ్' అవుతారన్న ధీమాతో వాడు బయలుదేరతానంటే మేం అడ్డు చెప్పలేదు.

వేణు వున్న 15 రోజులూ, మేం ఏ దిగులూ లేకుండా గడిపేశాం. నాన్నని వాడు చిన్నపిల్లాడులా చూసుకున్నాడు. వాడు వెళ్ళిన సంగతి ఆ తర్వాత మేం చెప్పాం నాన్నకి.

“ఏమోరా! వేణూ వచ్చినట్టు నాకసలు తెలీలేదు!" అని ఫీల్ అయ్యారు నాన్న సెప్టెంబర్ 20 గురువారం! సాయంత్రం 5 గంటల సమయం. ఆ రోజు పొద్దున్నుంచీ హాస్పిటల్ లోని అన్ని డిపార్ట్ మెంట్లకు వెళ్ళి బిల్లింగ్ ఫార్మాలిటీస్ అన్నీ పూర్తిచేశాం.

ఆ రోజు సాయంత్రం ఆరుగంటలకు నాన్నని డిస్చార్జ్ చేశారు. 'వీల్ ఛెయిర్'లో కూర్చుని లిఫ్ట్ లోనే కిందకు దిగాం. ఆ ప్రాంగణంలో వున్న వినాయకుడి విగ్రహానికి మేం అందరం దణ్ణాలు పెట్టుకున్నాం. అమ్మ వినాయకుడికి కొబ్బరికాయ కొట్టింది. తర్వాత అందరం ఎం.ఎల్.ఏ. కాలనీలో వుండే మా అన్నయ్య ఇంటికి నాన్నని తీసుకెళ్ళాం.

అప్పుడు రాత్రి ఏడుగంటలయింది. ఆ సమయంలోనే వరుణ్ సందేశ్ అయ్యప్ప పూజ చేస్తున్నాడు.

ఆ మర్నాడు సాయంత్రం బయల్దేరి' ఎ.సి. గార్డ్స్ 'ప్రాంతంలో వున్న మా అపార్ట్మెంట్ కి తీసుకొచ్చాం! అప్పటికే మదర్ థెరీసా 'ఆర్గనైజేషన్ తో మాట్లాడి నాన్నకి పూర్తిస్థాయిలో కూడా వుండేందుకు వీలుగా శ్రీనివాస్ అనే అటెండెంట్ ని నియమించుకున్నాం.

***( కొనసాగింపు వచ్చేనెలలో)***

Post your comments